

కుభీర్‌లోని ఎస్సీ కాలనీలో తాగునీటి కోసం చేతిపంపు వద్ద మహిళలు

## చేతి పంపు బాగు చేయరూ..?

కుభీర్, ఏప్రిల్ 2 : కుభీర్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో గల తాగునీటి చేతి పంపును కొట్టీ కొట్టీ చేతులు నొప్పి పెడుతున్నా నీరు రావడం లేదని మహిళలు వాపోతున్నారు. వారం రోజులుగా గుక్కెడు మంచినీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. దీనికి తోడు మిషన్ భగీరథ నీరు కూడా రాకపోవడంపై మండిపడుతున్నారు. ఈ చేతి పంపునకు మరమ్మతులు చేయాలని అధికారులను కాలనీవాసులు కోరుతున్నారు.

## నగదు సీజ్

భైంసా, ఏప్రిల్ 2 : పట్టణంలోని బొర్ర గణేశ్ చౌరస్తా వద్ద మంగళవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. చౌహన్ రామారావు, సోమవంశీ యోగేశ్, కదం కపిల్‌లు భైంసా నుంచి ఇతర గ్రామాలకు రూ.1.57 లక్షలను తీసుకెళ్తున్నారు. ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్టు పట్టణ సీఐ రాజారెడ్డి తెలిపారు.



భైంసా :పట్టుకున్న నగదు

**రూ.77 వేలు పట్టివేత ..**

కుంటాల, ఏప్రిల్ 2 : అర్లి క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. నిర్మల్ వైపు వెళ్తున్న జగిత్యాల జిల్లాకు చెందిన అబ్దుల్ రహ్మాన్ కారులో రూ.77వేలు స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్టు ఎస్ఐ రజనీకాంత్ తెలిపారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఐ శ్రీకాంత్

భైంసాటౌన్, ఏప్రిల్ 2 : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూరల్ పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం మీర్జాపూర్ గ్రామం వద్ద ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బందితో కలిసి ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. డబ్బు, బంగారం లాంటివి ఏవైనా తరలిస్తున్నారనే అంశాలను పరిశీలించారు. అవాంఛనీయ సంఘటనలు జరిగినా తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# గ్రామాల్లో నీటి సమస్య లేకుండా చూడాలి

ముథోల్, ఏప్రిల్ 2 : గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులకు సూచించారు. మండలంలోని ఆష్టా, రువ్వి గ్రామాలను మంగళవారం సందర్శించారు. మిషన్ భగీరథ పైపులైన్లను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎండ తీవ్రత దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో కూడా నూటికి నూరు శాతం పన్నులు వసూలు చేయాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.



భైంసా టౌన్ : సిరాల గ్రామస్తులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**సిరాల గ్రామం సందర్శన..**

భైంసాటౌన్, ఏప్రిల్ 2 : మండలంలోని సిరాల గ్రామాన్ని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సందర్శించారు. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయిన సిరాల పెద్ద చెరువును పరిశీలించారు. గ్రామస్తులు ఆయనతో మాట్లాడుతూ.. తాగు, సాగునీటి కోసం వర్షాలు కురవకముందే ప్రత్యేక అనుమతులు తీసుకొని, చెరువును పునర్నిర్మించాలని కోరారు. అనంతరం గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, నర్సరీ, శ్మశాన వాటికను పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీవో కోమల్ రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీవో మోజమ్ హుస్సైన్, మాజీ సర్పంచ్ సతీశ్, నాయకులు సదాశివ్ తదితరులు ఉన్నారు.

# ఘనంగా సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 2 : నిర్మల్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట గౌడ జన హక్కుల పోరాట సమితి జిలా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మోకు దెబ్బ జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర గౌడ సంఘాల జేఏసీ చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పన్నుల విధానం, బానిసత్వానికి వ్యతిరేఖంగా పోరాడి దేశ చరిత్రలో మొదటి బహుజన రాజ్యాన్ని స్థాపించిన రాజు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బాలా గౌడ్, శ్రీనివాస్ గౌడ్, మురళీ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, శ్రీనివాస్, అంజా గౌడ్, రాజేశ్వర్ గౌడ్, రాజు గౌడ్ పాల్గొన్నారు.

**భైంసాలో..**

భైంసా, ఏప్రిల్ 2 : పట్టణంలో గురుకృపా వొకేషనల్ జూనియర్ కళాశాలలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని తెలంగాణ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు ముష్కం రామకృష్ణ గౌడ్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ముథోల్ నియోజకవర్గ అధ్యక్షుడు పండిత్ రావు, భైంసా పట్టణ విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు మహిపాల్, మున్నూరుకాపు మిత్ర మండలి అధ్యక్షుడు పెండెపు కాశీనాథ్, జాదవ్ పుండలిక్ రావు, శ్రీనివాస్ గౌడ్, కొండ సత్యనారాయణ, ప్రేమానంద్, విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

**కడెంలో..**

కడెం, ఏప్రిల్ 2 : రాచరికపు వ్యవస్థ నీడలో జమీందార్లు, జాగీర్దాల అరాచకాలను సహించలేక కత్తి పట్టిన వీరుడు, దళిత, బహుజనులు ఏకమై పోరాడితేనే రాజ్యాధికారం సాధించవచ్చని నిరూపించిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని గౌడ సంఘం కడెం మండల నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని పాపన్న గౌడ్ విగ్రహం వద్ద వర్ధంతి నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా బహుజనులందరినీ ఏకతాటిపైకి తెచ్చి గొల్కొండ కోటపై జెండా ఎగరేసిన యోధుడు పాపన్నగౌడ్ అని కొనియాడారు. గౌడ సంఘం నాయకులు శేఖర్‌గౌడ్, రాజేశ్వర్ గౌడ్, రవీందర్‌గౌడ్, దశిగౌడ్, రాజాగౌడ్, మల్లాగౌడ్, నర్సాగౌడ్ పాల్గొన్నారు.



కడెంలో నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు




భైంసా : నివాళులర్పిస్తున్న నాయకులు

## సమగ్ర వ్యవసాయంపై అవగాహన



రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, వ్యవసాయ అధికారులు

కుంటాల, ఏప్రిల్, 2 : రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ హైదరాబాద్ నుంచి శాస్త్రవేత్త ఉమారెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం సమగ్ర వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులపై వివరించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకం వైపు మొగ్గు చూపాలని సూచించారు. దీనివల్ల ఖర్చు తగ్గి, అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. పోషక వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపర్చుకోవాలని సూచించారు. పొలాల్లో పశువుల ఎరువు వాడకాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో సోమలింగా రెడ్డి, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

## పరిమండల్, కనకాపూర్‌లో పోలీసుల కవాతు

లక్ష్మణచాంద, ఏప్రిల్ 2 : కనకాపూర్, మామడ మండలంలోని పరిమండల్ గ్రామాల్లో మంగళవారం పోలీసులు, సీఆర్పీఎఫ్ బలగాలు కవాతు నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆయా గ్రామాల్లో కవాతు నిర్వహించినట్లు సీఐ నవీన్ కుమార్ తెలిపారు. ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. లక్ష్మణచాంద ఎస్ఐ శ్రీకాంత్, మామడ ఎస్ఐ సందీప్, పోలీసులు పాల్గొన్నారు.



కనకాపూర్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, సీఆర్పీఎఫ్ బలగాలు

# కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కుంటాల, ఏప్రిల్ 2 : మండలంలోని అంబకంటి, కుంటాలలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు పీఏసీఎస్ సెక్రటరీ నాగభూషణ్ తెలిపారు. వరి ఏ గ్రేడ్ మద్దతు ధర క్వింటాలుకు రూ.2,203, బీ గ్రేడ్ ధర రూ.2183 ఉన్నదని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టాక్స్ సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి, మహేశ్, కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

**ఏడీఏ తనిఖీ..**

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో మంగళవారం పలు రికార్డులను ఏడీఏ వీణ పరిశీలించారు. ఎరువుల పంపిణీ తదితర విషయాలపై అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ పీఏసీఎస్ సెక్రటరీ నాగభూషణ్, వ్యవసాయ అధికారులు ఉన్నారు.

**గుండంపల్లి, సిర్గాపూర్‌లో..**

దిలావర్‌పూర్, ఏప్రిల్ 2 : మండలంలోని గుండంపల్లి, సిర్గాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక రైతులతో కలిసి ఏవో స్రవంతి, ఏకేపీ ఏపీఎం సులోచనారెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సీసీలు ముత్యం, సాయన్న, పోశెట్టి, రైతులు భోజన్న, ఐకేపీ మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

**లక్ష్మణచాంద మండలంలో..**

లక్ష్మణచాంద, ఏప్రిల్ 2 : మండలంలోని మల్లాపూర్, మునిపెల్లి, రాచాపూర్, బాబాపూర్ గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయా క్లస్టర్ పరిధిలోని ఏఈవోలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు పవిత్ర, సంతోష్, ఉమామహేశ్వరీ, రైతులు పాల్గొన్నారు.



కుంటాల : అంబకంటిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ అధికారులు



దిలావర్‌పూర్ : గుండంపల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న అధికారులు

# దిగుబడి రాకపోవడంపై రైతుల ఆందోళన

- విత్తనాలు అందించిన ప్రైవేటు కంపెనీపై చర్యలు తీసుకోవాలి
- గుండంపల్లిలో ఏవోకు వినతి

దిలావర్‌పూర్, ఏప్రిల్ 2 : ఆరుగాలం కష్టపడి పండించిన పంట దిగుబడి రాలేదని, అందుకు కారణమైన, తమకు విత్తనాలు అందించి మోసం చేసిన ప్రైవేటు కంపెనీపై చర్యలు తీసుకోవాలని దిలావర్‌పూర్ మండలం గుండంపల్లి రైతులు ఆందోళనకు చేశారు. ఈ సందర్భంగా రైతులంతా రైతు వేదిక వద్దకు వచ్చి సమావేశం నిర్వహించుకున్నారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అక్కడికి వచ్చిన ఏవోకు విషయాన్ని వివరించి, ఫిర్యాదు చేశారు. వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. యాసంగి సాగులో భాగంగా ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన మక్కలతో సుమారు 700 ఎకరాల్లో సాగు చేసినట్లు తెలిపారు. పంట చేతికి అందే సమయంలో ఎండు తెగులు సోకి 50 శాతం మక్క కర్ర ఎండిపోయి కిందపడిపోతున్నదన్నారు. దీంతో పంట పూర్తిగా దెబ్బతిన్నదని వాపోయారు. అలాగే ఎకరాకు దాదాపు 40 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా, కనీసం 15 క్వింటాళ్లు కూడా రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. సదరు కంపెనీపై చర్యలు తీసుకొని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతేని రైతులందరం ధర్నా, రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మక్క సాగుచేసిన రైతులు, నాయకులు పాల్గొన్నారు.



మక్క పంటను పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

## కిరణ్ సేవలు మరువలేనివి

నిర్మల్‌టౌన్, ఏప్రిల్ 2 : కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన కామ్రేడ్ కిరణ్ సేవలు మరువలేనివని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి రాజన్న అన్నారు. నిర్మల్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం కార్మిక సంఘం నాయకుడు కిరణ్ సంతాప సభ నిర్వహించారు. ఐఎఫ్‌టీయూలో ఆటో కార్మికుల సంక్షేమం కోసం ఆయన ఎంతగానో సేవ చేశారని కొనియడారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మి, గంగామణి, వసంత, కవిత, రాజు తదితరులు పాల్గొన్నారు.

# మక్క పంట పరిశీలన

ముథోల్, ఏప్రిల్ 2 : మండలంలోని తరోడా గ్రామంలో మక్క (హైబ్రీడ్ రకాలైన బీహెచ్ఎం 182, డీహెచ్ఎన్ 206తో పాటు కేఎన్ఎంహెచ్ 419 చిరు సంచులు)ను మంగళవారం ముథోల్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త కార్తీక్, కరీంనగర్ వ్యవసాయ పరిశోధనా క్షేత్రం శాస్త్రవేత్త డాక్టర్ మంజులత, ఉషారాణి, శ్రావణి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరీంనగర్‌లో రూపొందించిన కేఎన్ఎంహెచ్ 419, రాజేంద్రనగర్ మక్క వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి రూపొందించిన బీహెచ్ఎం 182 హైబ్రీడ్ వంగడాల సాగులో మెలకువలు, మక్క యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. సందేహాలు ఉంటే శాస్త్రవేత్తలను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముథోల్ మండల ఏవో భాస్కర్, ఆయా గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ముథోల్ : మక్క పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

**తిమ్మాపూర్‌లో..**

భైంసాటౌన్, ఏప్రిల్ 2 : మండలంలోని తిమ్మాపూర్‌లో ఏరువాక శాస్త్రవేత్తలు మక్క పంటను పరిశీలించారు. హైబ్రీడ్ మక్క సాగులో మెలకువలు, పంట యాజమాన్య పద్ధతులనను రైతులకు వివరించారు. ముథోల్ శాస్త్రవేత్త డీ కార్తీక్, కరీంనగర్ శాస్త్రవేత్తలు, ఏఈవో శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# కూలి గిట్టుబాటయ్యేలా చూసుకోవాలి

- డీఆర్డీవో విజయలక్ష్మి
- తిమ్మాపూర్‌లో ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి కూలీలకు సూచనలిస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మి

భైంసాటౌన్, ఏప్రిల్ 2 : ఉపాధి హామీ పథకంలో కూలీలు కొలతల ప్రకారం పనిచేసి, ప్రభుత్వం నిర్దేశించిన దినసరి కూలి పొందాలని డీఆర్డీవో విజయలక్ష్మి పేర్కొన్నారు. తిమ్మాపూర్ పంచాయతీలో ఉపాధి పనులను మంగళవారం తనిఖీ చేశారు. కూలీలు, సిబ్బందికి తగు సూచనలు, సలహాలు చేశారు. ఎండ తీవ్రమవుతున్న దృష్ట్యా కూలీలు ఉదయం త్వరగానే పనులకు వెళ్లి, త్వరితగతిన పనులు ముగించుకోవాలన్నారు. సకాలంలో పని పూర్తి చేసి కూలి రేటు గిట్టుబాటయ్యేలా చూసుకోవాలని తెలిపారు. వడదెబ్బ తగలకుండా ఆరోగ్య సిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచాలన్నారు. సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట ఏపీవో శివలింగం, కార్యదర్శి ప్రియాంక, తదితరులున్నారు.

**ముథోల్ లో ఇన్‌చార్జి ఈవో అనూష..**

ముథోల్, ఏప్రిల్ 2 : ముథోల్‌లో ఉపాధి పనులను గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి ఈవో అనూష పరిశీలించారు. పనుల వివరాలను ఫీల్డ్ అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. నియమాలకు అనుగుణంగా పని ప్రదేశంలో కూలీలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో శిరీష, ఫీల్డ్ అసిస్టెంట్ సృజన (సోని) తదితరులు పాల్గొన్నారు.

## పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 2 : నిర్మల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో 44 వైద్యాధికారుల పోస్టుల భర్తీకి 4న ఇంటర్వ్యూ నిర్వహించనున్నటుల ప్రిన్సిపాల్ జీవీడీఎస్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్ పోస్టుల-11, అసోసియేట్ ప్రొఫెసర్-20, అసిస్టెంట్ ప్రొఫెసర్-13, సీనియర్ రెసిడెంట్స్ హానరోరియం-19 కాంట్రాక్టు పద్ధతిన నియామకాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. 4న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య కళాశాలలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు www.https://gmcnirmal.orgను సంప్రదించాలని సూచించారు.

## మొక్కలను కాపాడాలి

సోన్, ఏప్రిల్ 2 : ఎండలు మండుతున్న నేపథ్యంలో నర్సరీల్లో పెంచుతున్న మొక్కలకు నీటిని పట్టి కాపాడాలని జడ్పీసీఈవో గోవింద్ అన్నారు. మాదాపూర్, గాంధీనగర్ గ్రామాల్లోని నర్సరీలను మంగళవారం పరిశీలించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో మొక్కలకు నీటిని పట్టి రక్షించాలని, పిచ్చి మొక్కలు పెరగకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేశ్, ఏపీవో మంజుల, కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

## విద్యుత్ సరఫరాకు ఆటంకం కల్గిస్తే చర్యలు

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 2 : ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందిస్తున్నామని, సరఫరాకు ఎవరైనా ఆటంకం కల్గిస్తే చర్యలు తీసుకుంటామని ఆ శాఖ ఏడీ రవి హెచ్చరించారు. నిర్మల్ పట్టణంలోని ఎల్లపల్లి రూట్‌లో గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ తీగలపై వైర్లు వేయడంతో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గిందన్నారు. తీగల మధ్య వైర్లు వేస్తే తెగిపోయే ప్రమాదం ఉందని, అలా ఎవరూ చేయవద్దని సూచించారు. అలాంటి చర్యలకు పాల్పడితే పోలీసులకు అప్పగిస్తామని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు కూడా నిరంతరం తనిఖీలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## 30 వరకు 5 శాతం మినహాయింపు

భైంసా, ఏప్రిల్ 2 : భైంసా మున్సిపాలిటీ పరిధిలో గృహ, వ్యాపార, వాణిజ్య సముదాయాల యజమానులు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులను ఏప్రిల్ 30వ తేదీలోగా అడ్వాన్స్‌గా చెల్లిస్తే పన్నుపై 5 శాతం మినహాయింపు ఇస్తున్నామని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినటుల పేర్కొన్నారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెంబి, ఏప్రిల్ 2 : పెంబి మండలం పస్పుల ఫీడర్ ప్రాంత గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ పస్పుల ఫీడర్‌పై ట్రీ బ్రాంచెస్ కటింగ్, లూజ్ జెంపరింగ్ ప్రాంతంలో రెక్టిఫికేషన్ పనులు చేపట్టనుండడంతో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 2 : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేదాక సీపీఎం కార్మిక సంఘం పోరాటం ఆగదని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రజాసంఘం భవనంలో మంగళవారం జిల్లా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఆచరణకు అమలు కాని హామీలు ఇచ్చిందని గుర్తుచేశారు. రైతులు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్, సురేశ్, గంగామణి, నూతన్‌కుమార్, సుజాత, రజిత, నవీన్, డిగంబర్, శైలజ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 2 : పార్లమెంట్ ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగ, ఉపాధ్యాయులు పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎన్నికల శిక్షణా నోడల్ అధికారి, డీఈవో రవీందర్ రెడ్డి సూచించారు. ఫారం-12ను శిక్షణా కేంద్రంలో ప్రత్యేక కౌంటర్‌లో తప్పక అందించాలని, ఖానాపూర్, ముదోల్, నిర్మల్‌లో పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం-12తో ఇపిక్ కార్డ్ జిరాక్స్‌ను, ఎన్నికల ఆర్డర్ కాపీని జతచేసి, శిక్షణ కేంద్రంలో అందించాలని తెలిపారు.

## ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శిగా డిగంబర్

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 2 : ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శిగా డిగంబర్, అధ్యక్షుడిగా నవీన్ ఎన్నికయ్యారు. నిర్మల్‌లో మంగళవారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. విద్యారంగ సమస్యలపై చర్చించి, పరిష్కారానికి సంఘం ద్వారా పోరాటాలు చేయాలని తీర్మానించారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి, అధ్యక్షుడిని సంఘం సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు

## తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

ఖానాపూర్, ఏప్రిల్ 2 : ఖానాపూర్ మున్సిపాలిటీలో ప్రణాళిక ప్రకారం తాగునీటి ఎద్దడికి చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం పేర్కొన్నారు. ఏడో వార్డులో బోరు మోటరు పనిచేయకపోవడంతో మంగళవారం మున్సిపల్ సిబ్బందితో మరమ్మతులు చేయించారు. ఆయన వెంట కౌన్సిలర్ కిశోర్‌నాయక్, కమిషనర్ మనోహర్, ఏఈ తిరుపతి తదితరులున్నారు.

## బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభం

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 2 : నిర్మల్ బస్టాండ్‌లో భగవాన్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం డిపో మేనేజర్ ప్రతిమా రెడ్డి చలి వేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. ఎనిమిదేండ్లుగా పట్టణ ప్రజలకు మండు వేసవిలో తాగునీటిని అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



డీఎం ప్రతిమా రెడ్డిని సన్మానిస్తున్న సభ్యులు